**ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం**

**ప్రాంతీయ వార్తా విభాగం**

**ప్రాంతీయ వార్తలు**

**తేది: 06.04.2025** **సమయం :13.10 గంటలు**

**ముఖ్యాంశాలు**

1. భారతీయ జనతా పార్టీ 45వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఈ రోజు రాష్ట్రమంతటా ఘనంగా నిర్వహిస్తున్నారు. నరేంద్ర మోదీ నేతృత్వంలో దేశం అన్ని రంగాల్లో ఉన్నత శిఖరాలను చేరిందని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అన్నారు.
2. శ్రీరామ నవమి పర్వదినాన్ని ప్రజలు భక్తి శ్రద్ధలతో జరుపుకుంటున్నారు. భద్రాచలంలో కన్నుల పండువగా జరిగిన సీతారామ కళ్యాణోత్సవంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. హైదరాబాద్ లో గట్టి భద్రతా ఏర్పాట్ల మధ్య రామనవమి శోభాయాత్ర ప్రారంభమయింది.
3. ఐపిఎల్ లో ఈ రాత్రి హైదరాబాద్ లో జరిగే మ్యాచ్ లో సన్ రైజర్స్ హైదరాబాద్, గుజరాత్ టైటాన్స్ జట్లు తలపడుతాయి.
4. ద్రోణి ప్రభావంతో రేపు, ఎల్లుండి రాష్ట్రంలోని పలు జిల్లాల్లో వర్షాలు కురుస్తాయని వాతావరణ కేంద్రం తెలిపింది.

..............................................

**బిజెపి**

భారత జనతా పార్టీ 45వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఈ రోజు ఘనంగా నిర్వహిస్తున్నారు. హైదరాబాద్ లోని పార్టీ కార్యాలయంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి పార్టీ జెండాను ఎగురవేశారు. 1980 ఏప్రిల్ 6వ తేదీన అటల్ బీహారీ వాజ్ పేయి నాయకత్వంలో బిజెపి ఏర్పాటైనప్పుడు చాలా మంది ఆ పార్టీని అవహేళనగా చూసారని, అదే పార్టీ ఇప్పుడు

దేశానికి దిక్సూచిగా మారిందని కిషన్ రెడ్డి అన్నారు. దేశంలో జవహర్ లాల్ నెహ్రూ తర్వాత అత్యధిక కాలం పరిపాలించిన ఘనత నరేంద్ర మోదీకే దక్కిందని అన్నారు. మోదీ నేతృత్వంలో దేశం అన్ని రంగాల్లో ఉన్నత శిఖరాలకు చేరిందని అన్నారు. తెలంగాణలో కూడా తమ పార్టీ త్వరలోనే అధికార పగ్గాలు చేపడుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ వైఫల్యాల పై నిరంతర పోరాటాలు జరపాలని పార్టీ శ్రేణులకు కిషన్ రెడ్డి పిలుపునిచ్చారు. ఈ రోజు నుంచి 14వ తేదీ వరకు పార్టీ ఆవిర్భావ దినోత్సవాలు జరపాలని, పార్టీ కార్యకర్తలు వారి ఇళ్ళపై పార్టీ జెండాలు ఎగురవేయాలని కిషన్ రెడ్డి కోరారు. అలాగే ఏప్రిల్ 14 నుంచి 22 వరకు డాక్టర్ అంబేద్కర్ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని కిషన్ రెడ్డి పిలుపునిచ్చారు.

**బైట్ ..........**

**బండి సంజయ్**

నరేంద్ర మోదీ పాలనలో భారత్ అన్ని రంగాల్లో అద్భుత ఫలితాలను సాధిస్తోందని, సంక్షేమంలో ముందంజలో ఉన్నదని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ అన్నారు. బిజెపి ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా కరీంనగర్ లోని జిల్లా పార్టీ కార్యాలయంలో ఆయన జెండాను ఎగురవేశారు. జాతీయ భావజాలం, సిద్ధాంత బలమే బిజెపి ని నేడు ఈ స్థాయికి తీసుకువచ్చిందని ఆయన అన్నారు. 16 రాష్ట్రాల్లో సొంతంగా, 6 రాష్ట్రాల్లో కూటమిగా బిజెపి ప్రభుత్వాలు నడిపిస్తోందని చెప్పారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, ముఖ్యమంత్రి రబ్బర్ స్టాంప్ లా మారి ఢిల్లీ, గాంధీ భవన్ ద్వారా పాలన సాగిస్తున్నారని బండి సంజయ్ ఆరోపించారు. ........పిటిసి కరీంనగర్

**హరీష్ రావు**

ఉత్తర తెలంగాణకు ఎంతో మేలు చేసే కాళేశ్వరం ప్రాజెక్టును ప్రభుత్వం చిన్న చూపు చూస్తున్నదని మాజీ మంత్రి, బి ఆర్ యస్ ఎమ్మెల్యే హరీష్ రావు ఆరోపించారు.

......పిటిసి, సిద్ధిపేట

**వరంగల్**

వరంగల్ పోలీస్ కమీషనరేట్ పరిధిలో నేటి నుంచి నెల రోజుల పాటు సిటీ పోలీస్ యాక్ట్ -30 అమలులో ఉంటుందని కమీషనర్ తెలిపారు.

.........పిటిసి, వరంగల్

**శ్రీరామ నవమి**

శ్రీరామ నవమి పర్వదినాన్ని ఈ రోజు రాష్ట్రమంతటా భక్తి శ్రద్దలతో జరుపుకుంటున్నారు. రామాలయాలతో పాటు వివిధ ప్రాంతాల్లో ప్రత్యేకంగా వేసిన పందిళ్ళలో సీతారాముల కళ్యాణాన్ని శాస్త్రోక్తంగా జరిపారు. భద్రాచలం మిథిలా స్టేడియంలో సీతారాముల కళ్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. ఉదయం 10 గంటల 30 నిమిషాలకు కళ్యాణ పూజలు ప్రారంభమ్యాయి. మధ్యాహ్నం అభిజిత్ లగ్నం సమీపించగానే వేదపండితులు సర్వలాంఛనాలతో సీతారాముల కళ్యాణం జరిపించారు. జీలకర్ర, బెల్లం మిశ్రమాన్ని సీతారాముల శిరస్సు పై ఉంచడం, తలంబ్రాల వేడుక, భక్త రామదాసు తయారు చేసిన పతకాన్ని కలిపి మూడు సూత్రాలను సీతమ్మ అమ్మవారికి ధరింపజేయటం భద్రాచలం క్షేత్రంలో ఆచారంగా వస్తుంది.

**సౌండ్ బైట్ ............**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్ర ప్రభుత్వం తరపున స్వామివారికి పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, తుమ్మల నాగేశ్వర రావు, కొండా సురేఖ, తదితరులు హాజరయ్యారు. వివిధ ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు సీతారాముల కళ్యాణానికి తరలి వచ్చారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా దేవస్థానం విస్తృత ఏర్పాట్లు చేసింది. కళ్యాణ ప్రాంగణమంతా రామనామ స్మరణతో మారుమ్రోగింది.

.....పిటిసి, కొత్తగూడెం

**శోభాయాత్రలు**

శ్రీ రామ నవమి సందర్భంగా హైదరాబాద్ సీతారాంబాగ్ ఆలయం, ఆకాశపురి హనుమాన్ ఆలయాల నుంచి భారీ శోభాయాత్రలు చేపట్టారు. హనుమాన్ టేక్డీ వద్ద ఈ యాత్ర ముగుస్తుంది. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా నగర పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ మార్గంలో ట్రాఫిక్ ఆంక్షలు ఉంటాయి. ఈరోజు రాత్రి 9 గంటల వరకు సీతారాంబాగ్ ఆలయం నుంచి ఊరేగింపు మార్గంలో ట్రాఫిక్ ఆంక్షలు అమలులో ఉంటాయి. గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ సీతారాం బాగ్ ఆలయాన్ని సందర్శించారు. కాగా నగరంలోని అన్ని రామాలయాల్లో సీతారామ కళ్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు.

(DESK)

**డీకే అరుణ**

వక్ఫ్ సవరణ బిల్లు పార్లమెంట్లో ఆమోదం పొందిన నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ మైనార్టీల్లో లేనిపోని అపోహలు సృష్టించేందుకు ప్రయత్నిస్తోందని బిజెపి జాతీయ ఉపాధ్యక్షురాలు, మహబూబ్ నగర్ పార్లమెంటు సభ్యురాలు డీకే అరుణ ఆరోపించారు. బిజెపి పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మహబూబ్ నగర్ లోని పార్టీ కార్యాలయంలో అరుణ మీడియాతో మాట్లాడుతూ, వక్ఫ్ సవరణ బిల్లు పార్లమెంట్లో ఆమోదం పొందడం వల్ల ముస్లింలకు ఎలాంటి నష్టం ఉండదని అన్నారు.

**BYTE-ARUNA ........**

(STRINGER-MBNGR)

**మంత్రులు**

రాష్ట్ర మంత్రులు పొన్నం ప్రభాకర్, సీతక్క నేడు ఉత్తరాఖండ్కు వెళ్లనున్నారు. సామాజిక న్యాయం, సాధికారతపై కేంద్ర మంత్రి వీరేంద్ర కుమార్ అధ్యక్షతన రేపు, ఎల్లుండి జరిగే చింతన్ శిబిర్ లో వీరు పాల్గొంటారు. BC సంక్షేమ పథకాలు, రిజర్వేషన్లు వంటి అంశాలపై మంత్రి

పొన్నం ప్రభాకర్ ప్రసంగించనున్నారు. దివ్యాంగులు, వృద్ధులు, ట్రాన్స్ జెండర్ల కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను మంత్రి సీతక్క వివరిస్తారు.

(DESK)

**చార్ ధామ్**

చార్ ధామ్ యాత్ర ఈ నెల 30నుంచి ప్రారంభం కానుంది. ఆ రోజు గంగోత్రి, యమునోత్రి ఆలయాలు తెరుచుకోనుండగా వచ్చే నెల 2న కేదార్నాథ్, 4న బద్రీనాథ్ గుళ్లను తెరుస్తారు. భక్తుల రక్షణార్థం 6వేల మందికి పైగా పోలీసుల్ని, భద్రతాసిబ్బందిని నియమించనున్నారు. 10 కిలోమీటర్లకు ఒక సెక్టార్ చొప్పున 137 సెక్టార్లుగా యాత్ర మార్గాన్ని విభజించామని, నిరంతరం భద్రతాసిబ్బంది గస్తీ తిరుగుతుంటారని అధికారులు తెలిపారు.

(DESK)

**సీతారామ ప్రాజెక్టు**

ఖమ్మం జిల్లాలో సీతారామ ప్రాజెక్టు సవరించిన అంచనాలకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. గతంలో ఈ ప్రాజెక్టు అంచనా వ్యయం 13,057 కోట్ల రూపాయలు ఉండగా, సవరించిన అంచనా వ్యయం 19,800 కోట్ల రూపాయలకు చేరుకుంది.

(DESK)

**వర్షాలు**

ద్రోణి ప్రభావంతో రేపు, ఎల్లుండి తెలంగాణలోని పలు జిల్లాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, మహబూబాబాద్, సూర్యాపేట, వరంగల్, హన్మకొండ, జనగామ జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉందని పేర్కొంది.

(DESK)

**ఐపీఎల్**

ఐపీఎల్ T20 క్రికెట్‌లో ఈ సాయంత్రం సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టు గుజరాత్ టైటాన్స్‌తో తలపడనుంది. ఈ మ్యాచ్ రాత్రి 7:30 గంటలకు హైదరాబాద్ లోని రాజీవ్ గాంధీ ఇంటర్నేషనల్ స్టేడియంలో ప్రారంభం కానుంది. ఇప్పటివరకు మూడు మ్యాచ్‌ల్లో రెండు విజయాలు సాధించిన గుజరాత్ జట్టు పాయింట్ల పట్టికలో మూడవ స్థానంలో ఉంది. మరోవైపు నాలుగు మ్యాచ్‌ల్లో కేవలం ఒకే ఒక్క విజయం సాధించిన హైదరాబాద్ జట్టు పట్టిక చివరి స్థానంలో ఉంది.

(DESK)

**యాడ్ శ్రీరామ నవమి**

శ్రీరామ నవమి సందర్భంగా వేములవాడ రాజ రాజేశ్వర స్వామి ఆలయంలో సీతారాముల కళ్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పట్టు వస్త్రాలు సమర్పించారు. జనగాం జిల్లాలోని ప్రధాన రామాలయాల్లో సీతారాముల కళ్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. వరంగల్, హనుమకొండ జిల్లాల్లో అనేక రామాలయాల్లో భక్తుల సందడి నెలకొంది. వెయ్యి స్తంభాల దేవాలయంతో పాటు పలు దేవాలయాల్లో కళ్యాణోత్సవాలు నిర్వహించారు. ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో జనకాపూర్ రామాలయంలో నిర్వహించిన కళ్యాణోత్సవంలో ఎమ్మెల్యే కోవ లక్ష్మి పాల్గొని, స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించారు.

.....పిటిసి, వేములవాడ, జనగాం, వరంగల్, హనుమకొండ, ఆసిఫాబాద్ జిల్లాలు